క్లుప్తంగా

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం



ఇంటింటి సర్వే చేస్తున్న విద్యార్థులు

పెదగంట్యాడ: ఆదిత్య డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో 50 మంది ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు వారం రోజుల పాటు పెదగంట్యాడలో నిర్వహించిన ప్రత్యేక శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులు ఇంటింటి సర్వే చేశారు. ప్రజలను సమస్యలడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలను నమోదు చేసుకుని 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయికి అందజేశారు. ఈ మేరకు నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో కార్పొరేటర్ లక్ష్మీబాయి, పాఠశాల హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్ పాల్గొని, విద్యార్థులను అభినందించారు. ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్స్ పి.ప్రదీప్‌కుమార్, ఎం.సత్యప్రకాష్, ఎన్‌ఎస్‌ఎస్ పీవో కె.శివకృష్ణ పాల్గొన్నారు.

పెదమడకలో హోమియో వైద్య సేవలు



వైద్య శిబిరంలో సేవలు అందిస్తున్న వైద్యులు

అగనంపూడి: ఆంధ్రప్రదేశ్ ఆయుష్ శాఖ, అగనంపూడి లయన్స్ క్లబ్ సంయుక్తంగా 85వ వార్డు పెదమడక ఉమామహేశ్వరస్వామి ఆలయం వద్ద శుక్రవారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించాయి. ఈ సందర్భంగా అగనంపూడి హోమియో వైద్యాధికారి డాక్టర్ కళావతి మాట్లాడుతూ ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంఘాలు సహకరిస్తే ప్రతీ గ్రామంలో ఉచిత హోమియో వైద్యశిబిరాలు నిర్వహించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. హోమియో మందులు తీసుకోవడం వల్ల ఎటువంటి దుష్ప్రభావం ఉండదన్నారు. ఈ సందర్భంగా 2 వందల మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్.శ్రీదేవి, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు గుదే సుశీలా గజేంద్రరావు, కిడిమి హనుమంతురావు, ఎం.జగదీష్, ఎ.వెంకటకృష్ణ, ఎం.మస్తాన్‌రెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల త్యాగం వృథా కానివ్వం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు నినాదంతో ఏర్పడిన స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ కోసం ఎందరో మహనీయులు చేసిన త్యాగాలను వృథా కానివ్వబోమని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1121వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన సీవో అండ్ సీపీపీ విభాగ కార్మికులు కూర్చుని, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కోసం ప్రాణాలను త్యాగం చేసిన మహనీయులను, భూములను వదులుకున్న నిర్వాసితులను మోదీ ప్రభుత్వం గుర్తు చేసుకోవాలన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తే ఉత్పత్తిలో పరుగులు పెడుతూ దేశంలో నంబర్ వన్ పరిశ్రమగా ఎదుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

శివోహం

- నీలకంఠుడికి భక్తజనుల నీరాజనం
- భక్తిశ్రద్ధలతో మహా శివరాత్రి పర్వదినం

నీలకంఠుడికి భక్తజనులు నీరాజనాలు సమర్పించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శైవక్షేత్రాలన్నీ పంచాక్షరితో ప్రతిధ్వనించాయి. మహాదేవుడిని పంచామృతాలతో అభిషేకించి, ప్రత్యేక పూజలు చేశారు. ముక్కంటిని త్రిదశాల (బిల్వపత్రాల)తో అర్చించారు. లింగోద్భవ కాలంలో భక్తులు ఆలయాలను దర్శించారు.

గాజువాక : మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని గాజువాక ప్రాంతం శివనామస్మరణతో మార్మోగింది. ఆలయ కమిటీలు ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాయి. వినాయకనగర్ వుడా కాలనీ కాశీ విశాలాక్షి విశ్వేశ్వర సహిత పంచాయతన ఆలయం, పాతగాజువాకలోని చట్టివానిపాలెం, చిట్టినాయుడుకాలనీ ఈశ్వరాలయం, అయ్యప్పస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దుర్గవానిపాలెం, గాజువాక గౌరీపరమేశ్వరుల ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు చేశారు. బీసీ రోడ్డు సంజీవకాలనీలో భద్రావతి భావనా రుషీశ్వరుల సమేత సత్యనారాయణస్వామి ఆలయం, సత్తెమ్మ తల్లి ఆలయంలో పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.చినగంట్యాడ వందడుగుల రోడ్‌లోని మంజునాథ ఆలయంలో విశేష పూజలు చేశారు. సహస్ర లింగార్చన అభిషేక పూజా మహోత్సవాలతో ఆలయ ప్రాంగణం హోరెత్తింది.

అప్పికొండ సోమేశ్వరాలయంలో..

పెదగంట్యాడ: 77వ వార్డు పరిధి అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రిని కనులపండువగా జరిపించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేయడంతో వేలాదిగా భక్తులు తరలివచ్చారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.




చట్టివానిపాలెం శివాలయంలో భక్తుల పూజలు

- 76వ వార్డు పరిధిలోని బాలచెరువు ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో పంచామృతాలతో అభిషేకాలు, హోమాలు, రుద్రాభిషేకాలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు.
- పెదగంట్యాడ దుర్గవానిపాలెం శివాలయంలో స్వామివారిని నగర మేయర్ హరి వెంకటకుమారి దంపతులు దర్శించుకున్నారు. ఆలయ, గ్రామ కమిటీ అధ్యక్షుడు గంట్యాడ గురుమూర్తి వారిని ఘనంగా సత్కరించారు.

అగనంపూడి: జీవీఎంసీ 79, 85 వార్డుల్లోని లంకెలపాలెం, ఫార్మాసిటీ, అగనంపూడి, దువ్వాడ పాంతాల్లోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. అగనంపూడి నిర్వాసితకాలనీ పెదమడకలోని ఉమామహేశ్వరస్వామి ఆలయంలో వేకువజామున నాలుగు గంటల నుంచి భక్తులు పెద్ద ఎత్తున చేరుకుని స్వామి వార్ని దర్శించుకున్నారు.

- 79వ వార్డు పాత అగనంపూడిలోని లింగాల తిరుగుడు ఆలయంలో విశేష పూజలు చేశారు.
- అగనంపూడి ఉక్కు జనరల్‌ఆస్పత్రి రహదారిలోని శనివాడ జాబిలీ హిల్స్‌లోని శ్రీ ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి పూజలు, రుద్రాభిషేకం నిర్వహించారు.
- అగనంపూడి రుద్రభూమిలో విశ్రాంత గ్రంథాలయ అధికారి పిల్లా సన్యాసిరావు సహకారంతో ఏర్పాటు చేసిన శివుని విగ్రహం వద్ద సన్యాసిరావు కుటుంబీకులు పూజలు చేశారు.



పూజలందుకుంటున్న అప్పికొండ సోమేశ్వరస్వామి

కూర్మన్నపాలెం: 86వ వార్డు మాతృశ్రీ నగర్ శివాలయంలో మహాశివునికి విశేష పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి, ఆలయ ధర్మకర్త దామా సుబ్బారావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముక్కంటికి విశేష పూజలు

అక్కిరెడ్డిపాలెం: 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం, రాంనగర్‌లలోని ఉమా రామలింగేశ్వరాలయాల్లో, మింది గుడివాడ అప్పన్న కల్యాణ మండపం వద్ద శివాలయంలో, గుడివాడ అప్పన్నకాలనీ, నాతయ్యపాలెంలోని కాశీ విశ్వేశ్వరాలయంలో, శీలానగర్, ఆటోనగర్‌లో గల పలు శివాలయాల్లో ముక్కంటికి విశేష పూజలు చేశారు.

అగనంపూడి: 85వ వార్డు గొన్నవానిపాలెంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మహా శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి శనివారం ఉదయం వరకు ఉత్సవాలు జరిగాయి. మంచు గెడ్డతో శివలింగాకారాన్ని తయారు చేశారు.



మాతృశ్రీనగర్ శివాలయంలో శివలింగాన్ని పుష్పాలతో అలంకరిస్తున్న అర్చకుడు



బాల చెరువులోని ఉమారామలింగేశ్వర ఆలయంలో పార్వతీదేవికి అభిషేకం

స్టీల్‌ప్లాంట్ శివాలయాల్లో..

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ శివాలయాలు శుక్రవారం శివనామస్మరణతో మార్మోగాయి. స్థానిక సెక్టార్–2కు చెందిన సత్యసాయి భక్తులు ఉదయం ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన నిర్వహించారు. హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు విశ్వశాంతి, విశ్వ మానవ కల్యాణం కోసం భజనలు చేశారు. వి స్టీల్ మహిళా సమితి అధ్యక్షురాలు నుపూర్ భట్, సత్యసాయి సమితి కన్వీనర్ జి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు సమీప ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో శివ పార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉక్కు ఉద్యోగుల దంపతులు పాల్గొన్నారు. సాయంత్రం నుంచి అర్ధరాత్రి లింగోద్భవ సమయం వరకు రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు.
- స్టీల్‌ప్లాంట్ రవీరేస్ బంక్ సమీప పాత కణితి శివాలయంలో రుద్రాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు.



అక్కిరెడ్డిపాలెంలో పూజలందుకుంటున్న ఉమారామలింగేశ్వరుడు



దుర్గవానిపాలెం శివాలయం వద్ద మేయర్ హరి వెంకటకుమారి దంపతులను సత్కరిస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు గంట్యాడ గురుమూర్తి



స్టీల్‌ప్లాంట్ సత్యసాయి మందిరంలో మహా శివరాత్రి పూజలు



జాబిలీహిల్స్‌లోని ఉమా మహేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



పాత అగనంపూడిలోని లింగాల తిరుగుడు ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



అప్పికొండ సోమేశ్వరస్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు



అక్కిరెడ్డిపాలెం ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు సమీప శివాలయంలో శివ పార్వతుల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

బాక్సింగ్ క్రీడాకారులకు కిట్ల అందజేత

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బాక్సింగ్ క్రీడాకారులకు శుక్రవారం కిట్లు అందజేశారు. స్టీల్‌ప్లాంట్ స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో ఈ నెల 12, 13 తేదీల్లో ఆల్ ఇండియా స్టీల్‌ప్లాంట్ల బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నారు. జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో నిర్వహిస్తున్న పోటీల్లో స్టీల్‌ప్లాంట్‌కు చెందిన యువ బాక్సర్లు ఎన్. నరేంద్ర కుమార్, ఎం.దిలేష్, కె. సాయి లోహిత్ సబ్ జూనియర్ కేటగిరీలో పాల్గొంటుండగా ఎం. లిఖిత్ కుమార్, ఎన్. రాంచరణ్ కుమార్, కె. దేవి శ్రీప్రసాద్ జూనియర్ కేటగిరీలో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ విభాగంలో జరిగిన కార్యక్రమంలో స్పోర్ట్స్ విభాగం ఇన్‌చార్జి సీజీఎం డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్, కోచ్ కె.శ్రీనివాసరావు, మేనేజర్ బి.రామారావు, టెక్నికల్ అఫీషియల్ ఎస్.వి. శర్మ చేతుల మీదుగా క్రీడాకారులకు కిట్లు అందజేశారు. స్పోర్ట్స్ విభాగం అధికారులు అమిత్ ఘడాయ్, కాశీ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



బాక్సింగ్ క్రీడాకారులకు కిట్లు అందజేసిన సీజీఎం ప్రకాశ్, కోచ్ శ్రీనివాసరావు

సెలవు రోజున స్కూళ్ల నిర్వహణపై సీరియస్

విశాఖవిద్య: శివరాత్రి పర్వదినం సందర్భంగా పాఠశాలలకు సెలవు ప్రకటించినా.. నగరంలోని కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు నిర్వహించడంపై రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సీరియస్‌గా తీసుకుంది. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహించిన పాఠశాలల వివరాలను అందజేయాలని కమిషన్ సభ్యుడు డాక్టర్ గొండు సీతారాం విద్యాశాఖాధికారులను ఆదేశించారు. శివరాత్రి పర్వదినాన్ని రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించినా, కొన్ని స్కూళ్ల యాజమాన్యాలు తరగతులు నిర్వహించినట్లు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆధారాలతో కమిషన్ దృష్టికి తీసుకొచ్చారన్నారు. దీన్ని సుమోటోగా స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

హెచ్‌పీసీఎల్‌లో ప్రమాదం

మల్కాపురం: హెచ్‌పీసీఎల్(విశాఖ రిఫైనరీ) సంస్థలో శుక్రవారం ఉదయం ప్రమాదం జరిగింది. సంస్థలో పైప్‌లైన్ నుంచి స్టీమ్ ఫోర్స్‌గా రావడంతో ఇద్దరు కాంట్రాక్ట్ కార్మికులకు గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలివీ.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రమోద్ సింగ్, షాయిద్ మైతీ ఉపాధి నిమిత్తం గతేడాది మల్కాపురం వచ్చారు. హెచ్‌పీసీఎల్‌లోని సీఆర్–3 అనే సంస్థలో ప్రమోద్‌సింగ్ ఫోర్‌మన్‌గా, షాయిద్ మైతీ రిగ్గర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. సంస్థ ఆవరణలో డీహెచ్‌ఎస్‌పీఎఫ్‌ఆర్‌యూ ప్లాంట్ యూనిట్‌లో కొన్ని రోజుల నుంచి మరమ్మతు పనులు జరుగుతున్నాయి. ఈ యూనిట్‌లోని పైపుల్లో చమురు వంటి మడ్డి వంటి పదార్థాలు నిలిచిపోయాయి. దీంతో స్టీమ్‌ను ఆ పైపుల్లోకి ఎక్కించి, ఆ స్టీమ్ ద్వారా మడ్డిని బయటకు తీస్తున్నారు. ఐదు రోజులుగా ఈ పనులు జరుగుతుండగా.. శుక్రవారం ప్రమోద్‌సింగ్, షాయిద్ మైతీ ఈ పనులు చేపడుతున్నారు. ఆ సమయంలో పైపుల్లోని స్టీమ్ ఫోర్స్‌గా ఒక్కసారి బయటకు రావడంతో అక్కడ ఉన్న ప్రమోద్, మైతీ గాయపడ్డారు. తోటి కార్మికులు వారిని సంస్థ అంబులెన్స్‌లో నగరంలోని అపోలో ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న ఏసీపీ మోజెస్‌పాల్, మల్కాపురం సీఐ సన్యాసినాయుడు ఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదంపై ఆరా తీశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి వివరాలు సేకరించారు.

‘ఆమె’దే అగ్రస్థానం

- జగనన్న పాలనలో అన్ని రంగాల్లో అతివలకు ప్రాధాన్యం
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- ఘనంగా మహిళా దినోత్సవం



భెల్ ఉద్యోగుల మాతృమూర్తులకు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న యూనియన్ ప్రతినిధులు

పెదగంట్యాడ: మహిళలు తాము ప్రవేశించిన ప్రతీ రంగంలో ఉన్నతంగా రాణిస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. వారికి అన్ని రంగాల్లో ఉన్నత స్థానం కల్పించింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో డీసీఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కేక్ కట్ చేసి, సంబరాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. పలువురు మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్లు భూపతిరాజు సుజాత, బొడ్డు నరసింహపాత్రుడు, మహ్మద్ ఇమ్రాన్, నాయకులు రోజారాణి, కోమటి శ్రీనివాసరావు, ధర్మాల శ్రీనివాసరావు, బోగాది సన్ని, ఎండీ గౌస్, మంత్రి శంకరనారాయణ, గొందేశి వెంకటరమణారెడ్డి నక్క రమణ, రంబ నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

- కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో నియోజకవర్గ నాయకుడు చెల్లుబోయిన నాయుడు ఆధ్వర్యంలో మహిళలను సత్కరించారు. యలమంచిలి నాగమల్లిక, నెల్లి తులసి, చెల్లుబోయిన అరుణ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో..

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ మహిళా ఉద్యోగులు ప్రతిభావంతులని గీతం యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ లా డైరెక్టర్ డాక్టర్ అనితారావు అన్నారు. ఉక్కు ఎల్‌డీసీ ఆడిటోరియంలో నిర్వహించిన వేడుకల్లో ఆమె ప్రసంగించారు. విప్స్‌కు చెందిన దిశ మ్యాగజైన్‌ను అతిథులు ఆవిష్కరించారు. వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన స్టీల్‌ప్లాంట్ మహిళా ఉద్యోగులను సత్కరించారు. వి స్టీల్ మహిళా సమితి ప్రతినిధులు నుపూర్ భట్, అంజు మొహంతి, సీజీఎంలు జి.గాంధీ, శ్రీధర్, డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్ పాల్గొన్నారు.



మహిళలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గురుమూర్తిరెడ్డి, దేవన్‌రెడ్డి

అవార్డుల ప్రదానం

గాజువాక : వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు బీజేపీ నాయకులు ఆదర్శ వనిత అవార్డులను ప్రదానం చేశారు. ఈ అవార్డులను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర అందజేశారు. బీజేపీ గాజువాక కన్వీనర్ కె.నర్సింగరావు పాల్గొన్నారు.

- గాజువాకలోని యాక్సెప్ట్ సీసీపీయూ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రసాద్, ప్రాజెక్టు మేనేజర్లు ఢిల్లీశ్వరరావు, పోలినాయుడు, ప్రతినిధులు పాల్గొన్నారు.

అగనంపూడి: సమాజంలో మహిళలకు సమోన్నత స్థానం లభిస్తోందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి భార్య తిప్పల రాధ అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అగనంపూడి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీమణి రాధ, కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, కమిటీ సభ్యురాలు నక్కా కల్యాణిలను వైద్యులు సత్కరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉష, ఆస్పత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

- పాత అగనంపూడి సత్రం కూడలిలోని మహాత్మాగాంధీ సేవా సంఘం, శ్రీబొబ్రమాంబ పారాయణ సేవా సమితి సంయుక్తంగా నిర్వహించిన వేడుకల్లో సీనియర్ సిటిజన్ తీగల బంగారుశెట్టి సతీమణి సత్యవతిని ఘనంగా సత్కరించారు.



సీనియర్ సిటిజన్ తీగల సత్యవతిని సత్కరిస్తున్న మహాత్మాగాంధీ సేవా సంఘం ప్రతినిధులు



మహిళలను సత్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు చెల్లుబోయిన నాయుడు

- గొన్నా ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో నిర్వహించిన వేడుకల్లో హ్యాండ్స్ గ్లోబల్ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మివెంకు మహంతి పాల్గొని స్త్రీ శక్తి, గొప్పతనం గురించి మాట్లాడారు. కళాశాల డైరెక్టర్ హేమచంద్ర నాయుడు,ప్రిన్సిపాల్ మూర్తి పాల్గొన్నారు.

మహిళలకు పోటీలు

గాజువాక: గాజువాక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మహిళలకు ఆటల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకురాలు ఉరుకూటి లక్ష్మి,నాయకులు యువశ్రీ, పీతల అరుణ, నిర్మలారెడ్డి, కటికల కల్పన, మంత్రి మంజుల, వియ్యపు ఉమాదేవి, మీరా, గొంతిన సత్యవతి, శ్యామల, అరుణ, పుష్ప, ఆదిలక్ష్మి, విమల థామస్ తదితరులు పాల్గొన్నారు.

- భాస్కర్ విద్యా నికేతన్‌లో మహిళా సిబ్బందిని పాఠశాల డైరెక్టర్ భాస్కరావు సత్కరించారు.

మాతృమూర్తులను గౌరవించాలి

అక్కిరెడ్డిపాలెం: మాతృమూర్తులను గౌరవించి జన్మకు సార్థకత చేకూర్చుకోవాలని భెల్ గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి సుభాకర్ సాహు అన్నారు. భెల్ టౌన్ షిప్‌లో నివాసం ఉంటున్న అధికారులు, ఉద్యోగుల మాతృమూర్తులకు సంస్థ పరిపాలన భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో గుర్తింపు యూనియన్ ప్రతినిధులు సత్కరించారు. సంస్థ ఈడీ ఎస్.జితేందర్ రెడ్డి, జీఎం ప్రొడక్షన్, హెచ్‌ఆర్ హెడ్ ఇన్‌చార్జి సి.గౌరీ శంకర్, గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు బొండ బాబూరావు, ప్రతినిధులు పాల్గొన్నారు.

- అక్కిరెడ్డిపాలెం రామాలయం వద్ద ఐద్వా నాయకురాలు జె.శ్రీలక్ష్మి ఐద్వా జెండా ఎగరవేశారు. అమ్మ గొప్పతనంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు ఐద్వా విశాఖ జిల్లా కార్యదర్శి వై.సత్యవతి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.



హ్యాండ్స్ గ్లోబల్ సంస్థ ఎండీ లక్ష్మి వెంకు మహంతిని సత్కరిస్తున్న గొన్నా కళాశాల యాజమాన్యం



ఉక్కు ఎల్‌డీసీ ఆడిటోరియంలో ప్రసంగిస్తున్న గీతం లా స్కూల్ డైరెక్టర్ అనితారావు



గాజువాక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మ్యూజికల్ చైర్ పోటీల్లో పాల్గొన్న మహిళలు



ఆదర్శ వనిత అవార్డులతో మహిళలు



అగనంపూడి ఆస్పత్రిలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి సతీమణి రాధ



యాక్సెప్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో..



వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఐద్వా జిల్లా కార్యదర్శి సత్యవతి

అన్ని రంగాల్లో మహిళల ప్రతిభ



కేక్ కట్ చేస్తున్న విశాఖపట్నం ఎస్ఈజెడ్ జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్ రోషిణి అపరంజి కోరాటి

విశాఖ సిటీ: మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభ చూపించగలరని విశాఖపట్నం స్పెషల్ ఎకనామిక్ జోన్ జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్ రోషిణి అపరంజి కోరాటి అన్నారు. పోలీస్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె కేక్ కట్ చేసి మాట్లాడారు. విధుల్లో ప్రతిభ కనబరిచిన మహిళలను గుర్తించి సత్కరించడం స్ఫూర్తిదాయకమన్నారు. ‘ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం–పోలీస్ శాఖ కుటుంబ సలహా నివేదిక’, ‘ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం–పోలీసు శాఖ ఫ్యామిలీ కౌన్సెలింగ్‌కు హాజరుకు నోటీసు’ అనే పుస్తకాలను విడుదల చేశారు. సీపీ ఎ.రవిశంకర్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు గొప్పగా రాణిస్తున్నారని, మహిళలకు ఓర్పు, సహనం ఎక్కువని తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన వైజాగ్ సిటీ పోలీస్ మహిళా కో–ఆపరేటివ్ సొసైటీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పోలీస్‌శాఖలో ప్రతిభ కనబరిచిన 26 మంది మహిళా పోలీసులకు సన్మానించి అవార్డు, ప్రశంసాపత్రాలు అందజేశారు. జాయింట్ సీపీ కె.ఫకీరప్ప, డీసీపీ–1 వి.ఎన్.మణికంఠ చందోలు, డీసీపీ(క్రైం) పి.వెంకటరత్నం, ప్రాసిక్యూషన్స్ డీడీ ఎం.శైలజ, ఏడీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



రైల్వేస్టేషన్‌లో మరణించిన గుర్తు తెలియని వ్యక్తి

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లోని 7వ నంబర్ ప్లాట్‌ఫాం పై శుక్రవారం వేకువజామున గుర్తు తెలియని వ్యక్తి మరణించాడు. సుమారు 65 ఏళ్ల వయసున్న అతని ఎత్తు 5.5 అడుగులు, చామనచాయ రంగులో ఉన్నట్లు జీఆర్పీ ఎస్ఐ బాలాజీరావు తెలిపారు. అతని ఆచూకీ తెలిసిన వారు విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ పోలీసులకు గానీ, 96661 22722, 94406 27547 నంబర్లకు గానీ సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.